## గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల బదిలీకి దరఖాస్తులు

నల్లగొండ/రామగిరి, జూన్ 27: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదివే విద్యార్థులు తాము కోరుకునే పాఠశాలలో బదిలీ కోసం ఈ నెల 27నుంచి జూలై 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని రీజినల్ కో ఆర్డినేటర్ హెచ్. అరుణకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

5వ తరగతి నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు అవకాశం ఉందని, ఆన్‌లైన్‌లో రూ. 100 చెల్లించి https://tgswadtr.cgg.gov.in దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.

**మిగులు సీట్ల భర్తీకి..**

అలాగే 5నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్లలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 26నుంచి జూలై 12లోగా రూ. 100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

# పర్యవేక్షణ పేరుతో పెత్తనం!

**నల్లగొండ ప్రభుత్వ జనరల్ దవాఖానలో డాక్టర్లు, సిబ్బంది నిరసన**

- అత్యవసర సేవలు మినహా ఇతర సేవలు బహిష్కరణ
- కలెక్టర్ ఆదేశాలను రద్దు చేయాలని డిమాండ్
- మా పొట్ట కొట్టొందంటూ అదనపు కలెక్టర్ కాళ్లపై పడ్డ కార్మికులు
- నేడు నల్లబ్యాడ్జీలతో ఆస్పత్రిలో నిరసన



నల్లగొండ జనరల్ దవాఖాన ఎదుట నిరసన తెలుపుతున్న డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది

నీలగిరి, జూన్ 27 : మెరుగైన వైద్య సేవల కోసం పర్యవేక్షణ పేరుతో ఇతర శాఖల అధికారులు తమపై పెత్తనం చేస్తున్నారని నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది ఆందోళనకు దిగారు. కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులను నిరసిస్తూ డాక్టర్లు ఓపీ సేవలను నిలిపివేసి ఆస్పత్రి ఆవరణలో నిరసన తెలిపారు. దాంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అత్యవర సేవలు మాత్రం యథావిధిగా కొనసాగాయి. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)ని రోజుకొక జిల్లా స్థాయి అధికారి చొప్పున ఉదయం 8 నుంచి 11 గంటల వరకు సందర్శించాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఇటీవల ఉత్తర్వులిచ్చారు. 45 మంది అధికారులను నియమించి రోజుకొకరు ఆసుపత్రిని సందర్శించాలని ఆదేశించారు. దీంతో రోజుకొక అధికారి ఆస్పత్రిని సందర్శించి రోగులకు అందుతున్న సేవలు, ఓపీలో ఎదురవుతున్న ఇబ్బందులు, శానిటేషన్, డైట్, తాగునీరు, డాక్టర్ల హాజరు, రేడియాలజీ, డయాగ్నోస్టిక్ సెంటర్‌లో పరీక్షలు, ఇతర మౌలిక సదుపాయాలు, రోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై తనిఖీ చేస్తున్నారు.

### ఇతర శాఖల అధికారులకు తనిఖీ చేసే అధికారం లేదు

తనిఖీలు చేసే అధికారులు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, మెడికల్ కళాశాలకు చెందిన డాక్టర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం అత్యవసర సేవలను మినహాయించి ఓపీ సేవలను బహిష్కరించారు. ఆస్పత్రి ఎదుట బైఠాయించారు. 'ఇతర శాఖల పెత్తనం మాపై వద్దు.. మాకు గౌరవం కావాలి.. కలెక్టర్ ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలి' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రోగులకు మెరుగైన వైద్య సేవలను అందిస్తున్న తమను అవమాన పరిచేలా వివిధ శాఖల అధికారులను నియమించి తమ మీద పెత్తనం చెలాయించే విధంగా కలెక్టర్ ఉత్తర్వులు ఇవ్వడం సరికాదన్నారు. జీజీహెచ్, మెడికల్ కళాశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లను తనిఖీలు చేసే అధికారం కలెక్టర్, జాయింట్ కలెక్టర్లకు తప్ప ఇతర శాఖల అధికారులకు లేదని, మెడికల్ అండ్ హెల్త్ కమిషనర్ 2018లోనే స్పష్టం చేసిందని గుర్తు చేశారు. వైద్యరంగానికి సంబంధించి అవగాహన లేని ఇతర శాఖల అధికారులు ఆస్పత్రిని ఎలా తనిఖీ నిర్వహిస్తారని ప్రశ్నించారు.

## కలెక్టర్ X జీజీహెచ్

### అదనపు కలెక్టర్‌ను పంపిన కలెక్టర్

సమాచారం అందుకున్న కలెక్టర్ నారాయణరెడ్డి వెంటనే జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూర్ణచంద్రను ప్రభుత్వ జనరల్ దవాఖానకు పంపించారు. ఆయన నిరసన వ్యక్తం చేస్తున్న డాక్టర్లు, సిబ్బందితో మాట్లాడి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. డాక్టర్లపై ఎలాంటి ఉండదని, కేవలం హాజరు, శానిటేషన్, డైట్, తాగునీరు, ఓపీ, రేడియాలజీ, డయాగ్నోస్టిక్ సెంటర్, రోగుల ఇబ్బందులపై మాత్రమే అధికారులు తనిఖీలు నిర్వహించి కలెక్టర్‌కు నివేదిస్తారని తెలిపారు. డాక్టర్ల విధులు, వారి వృత్తిలో అధికారుల జోక్యం ఉండదని, డాక్టర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. వారికి సర్ది చెప్పినప్పటికీ డాక్టర్లు వినకుండా ఆర్డర్‌ను రద్దు చేసేంత వరకు తమ నిరసన కొనసాగుతుందని తెలిపారు. సాయంత్రం వరకు నిరసన కొనసాగించారు. కలెక్టర్ ఆస్పత్రికి వస్తారని సాయంత్రం వరకు ఎదురుచూసిన డాక్టర్లు ఆయన రాక పోవడంతో వెళ్లిపోయారు. శుక్రవారం కూడా తమ నిరసన ఉంటుందని వైద్యులు స్పష్టం చేశారు.


### విధుల్లోకి తీసుకోవాలని వేడుకున్న శానిటేషన్ సిబ్బంది

తమ పొట్టకొట్టొద్దని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వచ్చిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర కాళ్లను పట్టుకుని శానిటేషన్ సిబ్బంది వేడుకున్నారు. తమను అకారణంగా సస్పెండ్ చేశారని, తమను విధుల్లోకి తీసుకోవాలని ప్రాధేయపడ్డారు. వారిని ఎంత వారించినా వినకపోవడంతో ఆయన వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఇటీవల విధుల నుంచి తొలగించిన తమను తిరిగి తీసుకోవాలని ప్రాధేయపడుతున్న శానిటేషన్ సిబ్బంది

తాను వేరే పనిపై వస్తే తన కాళ్లు పట్టుకుని కిందపడేసే విధంగా వ్యవహరిస్తారా అని మండిపడ్డారు. డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మాత్రు జోక్యం చేసుకొని సిబ్బందిని పక్కకు పంపించారు. ఇక కలెక్టర్ నారాయణరెడ్డి దీనిపై స్పందిస్తూ త్వరలో ప్రభుత్వ మెడికల్ కళాశాల, జీజీహెచ్ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



దేవరకొండలో సాయిబాబాకు పూజలు చేస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

## ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

చందంపేట(దేవరకొండ), జూన్ 27 : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని, తద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చునని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. దేవరకొండ పట్టణంలోని షిర్డీ సాయి బాబా దేవాలయం, జ్ఞాన సరస్వతి దేవి దేవాలయం18వ అష్టాదశ వార్షికోత్సవాలకు గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలి చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు సాయి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. దేవాలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు గుత్తా సుఖేందర్‌రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన నిర్వహించారు. కార్యక్రమంలో దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, మాజీ మున్సిపల్ చైర్మన్ వడ్త్యా దేవేందర్‌నాయక్, శిరందాసు కృష్ణయ్య, పానుగంటి మల్లయ్య, రామాచారి, లక్పతి, శ్రీనివాస్, పురుషోత్తం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పవర్ ప్లాంట్‌లో ఏ సమస్య ఉన్నా తక్షణమే పరిష్కరించాలి

- భూసేకరణ బకాయిలను వెంటనే చెల్లించాలి
- ప్లాంట్‌లో జ్వరాల నివారణకు చర్యలు తీసుకోవాలి
- యాదాద్రి పవర్ ప్లాంట్‌ను సందర్శించిన కలెక్టర్ నారాయణరెడ్డి



యాదాద్రి పవర్ ప్లాంటు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

దామరచర్ల, జూన్ 27 : మండలంలోని యాదాద్రి పవర్‌ప్లాంట్‌ను కలెక్టర్ నారాయణరెడ్డి గురువారం సందర్శించారు. ప్లాంటులో కొనసాగుతున్న యూనిట్లకు సంబంధించిన చిమ్నీలు, బాయిలర్స్, కూలర్లు, సబ్‌స్టేషన్లు, రిజర్వాయర్లను ఆయన పరిశీలించారు. అనంతరం బీహెచ్‌ఈఎల్, టీజీ జెన్‌కో అధికార్లతో సమావేశం ఏర్పాటు చేసి పనుల ప్రగతిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. పవర్ ప్లాంటులో ఏ సమస్యలున్నా తక్షణమే పరిష్కరించాలని, వైటీపీఎస్‌కు సంబంధించిన భూసేకరణ బకాయిలను పెండింగ్ ఉంటే చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ శ్రీనివాసరావును ఆదేశించారు. ప్లాంటులో పనిచేస్తున్న కార్మికులు జ్వరాలతో బాధపడుతున్నట్లు పత్రికల్లో వచ్చిన వార్తలకు స్పందించిన కలెక్టర్ జ్వరాల నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని, జ్వర బాధితులకు వైద్య సదుపాయాలను అందించాలని తెలిపారు. పవర్ ప్లాంట్ మొదటి, రెండు యూనిట్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, విద్యుత్తు ఉత్పత్తిని గడువులోగా ప్రారంభిస్తామని అధికారులు చెప్పారు.

### ప్రజా సమమస్యలను పరిష్కరించాలి

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. దామరచర్ల తాసీల్దార్ కార్యాలయంలోని రికార్డులను ఆయన పరిశీలించారు. ఇటీవల నిర్వహించిన ప్రజావాణి దరఖాస్తుల సమస్యలపై తాసీల్దార్ జవహర్‌లాల్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రజావాణి, ధరణి సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కలెక్టర్ వెంట ప్లాంట్ సీఈ సమ్మయ్య, ఆర్ఐ సతీశ్ తదితరులు ఉన్నారు.

## నేడు డీసీసీబీ చైర్మన్‌పై అవిశ్వాసం

- డీసీఓ సమక్షంలో నల్లగొండలో బలపరీక్ష
- 14 మంది మద్దతు ఇస్తే నెగ్గే అవకాశం
- బీఆర్‌ఎస్ సభ్యుల మద్దతు నాకే : చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి




నల్లగొండ, జూన్ 27 : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డిపై సభ్యులు పెట్టిన అవిశ్వాసంపై శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్ర కార్యాలయంలో బల పరీక్ష జరుగనుంది. డీసీఓ కిరణ్ కుమార్ సమక్షంలో ఉదయం 11 గంటలకు అవిశ్వా పరీక్ష నిర్వహించనుండగా గెలుపుపై ఎవరి అంచనాలు వారికే ఉన్నాయి. సహకార డైరెక్టర్లుగా మొత్తం 20 మంది ఉండగా, అందులో ఒక సీటు ఖాళీగా ఉంది. మిగిలిన 19 మంది సభ్యుల్లో 14 మంది మద్దతు ఎవరికో గెలుపు వారిది కానుంది. అయితే చైర్మన్ మహేందర్ రెడ్డిపై ఈ నెల 10న ఇచ్చిన నోటీసులో 14 మంది తమ సంతకాలు పెట్టి డీసీఓకు అందజేయగా వారిలో నేడు జరిగే ఓటింగ్ సమయానికి ఎవరు ఎటు వైపు ఉంటారో ప్రశ్నార్థకంగా మారింది. డీసీఓకు ఇచ్చిన నోటీసులో 14 మంది సభ్యులు ఉండగా అందులో విదేశాల టూర్‌లో ఉన్న డీసీసీబీ వైస్ చైర్మన్ ఎసిరెడ్డి దయాకర్ రెడ్డి మద్దతు కూడా తమకే ఉంటుందనేది అవిశ్వాసం పెట్టిన వారి మాట. దయాకర్ రెడ్డి విదేశాల నుంచి బుధవారం వచ్చినట్లు తెలుస్తుండగా ఆయన ఎవరికి మద్దతిస్తారనేది నేడు తేలనుంది. హుజూర్‌నగర్‌కు చెందిన అప్పిరెడ్డి, రంగాచారి, దేవరకొండకు చెందిన పల్లా ప్రవీణ్ రెడ్డితో పాటు మరొకరు చైర్మన్ వెంట ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ ఐదుగురు మద్దతుతోపాటు ప్రస్తుతం బీఆర్‌ఎస్‌లోనే ఉండి కాంగ్రెస్ కండువాలు కప్పుకోని సుష్మ, కరుణ, జయరాం నాయక్ కూడా తనకే మద్దతు ఇస్తారనే విషయాన్ని మహేందర్ రెడ్డి బలంగా విశ్వసిస్తున్నారు. వారు ఇప్పటికీ బీఆర్‌ఎస్‌లోనే ఉన్నందున గొంగిడికే మద్దతు పలుకుతారా లేదా విపక్ష కూటమికి మద్దతు ఇస్తారా అనేది ఆసక్తిగా మారింది.

### 15 రోజులుగా క్యాంపులో..

చైర్మన్ మహేందర్ రెడ్డిపై ఈ నెల 10న అవిశ్వాస నోటీస్ ఇచ్చిన విపక్ష కూటమి సభ్యులు మరుసటి రోజు నుంచి కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో పర్యటిస్తూ క్యాంపులో ఉన్నారు. వారు శుక్రవారం ఉదయం జిల్లా కేంద్రంలోని డీసీసీబీ కార్యాలయానికి చేరుకోనున్నారు. క్యాంపునకు బీఎస్పీలో ఉన్న అంజయ్య, వైస్ చైర్మన్ ఎసిరెడ్డి దయాకర్ రెడ్డితోపాటు చైర్మన్ వెంట ఉన్న వారు వెళ్లలేదు. చైర్మన్ పదవి ఆశించిన మునుగోడు నియోజకవర్గ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి ఈ క్యాంపు నిర్వహించారు. 14 మంది ఎవరికి మద్దతు ఇస్తే వారే కొత్త చైర్మన్‌గా ఎన్నిక కానుండగా, కొత్త పాలకవర్గం టర్మ్ కూడా వచ్చే ఏడాది ఫిబ్రవరితో పూర్తి కానుంది.

### పార్టీ మారితే వచ్చే పదవి వద్దనే కాంగ్రెస్‌లోకి వెళ్లలేదు

**గొంగిడి మహేందర్ రెడ్డి, చైర్మన్ డీసీసీబీ**

నల్లగొండ డీసీసీబీ బ్యాంకు అవినీతిలో కూరుకుపోతే దాన్ని ఎంతమేరకు అభివృద్ధి చేశానో రైతులు, ఉద్యోగులు, ప్రస్తుత డైరెక్టర్లకు తెలుసు. అన్ని తెలిసిన వారు అవిశ్వాసం పెడితే ఏం చేస్తాం. పైగా పార్టీ మారితే నా పదవి నాకే ఉంటుందని కాంగ్రెస్ వాళ్లు ఆఫర్ చేశారు. రాష్ట్రంలో 9 డీసీసీబీలు ఉంటే అందులో కరీంనగర్, నల్లగొండ తప్ప మిగిలిన ఏడుగురు బీఆర్‌ఎస్ చైర్మన్‌లే. కాంగ్రెస్‌లోకి వెళ్లడంతో వాళ్ల పదవులు అట్లనే ఉన్నయి. ఆ పదవుల కోసం కేసీఆర్‌ను వదిలి వెళ్లలేమని ఉన్నాను. అయినా నా వెంట ఐదుగురు సభ్యులు ఉన్నారు. వారితోపాటు క్యాంపునకు వెళ్లిన వారిలోనూ ముగ్గురు మా పార్టీ వారే. వారు నాకే మద్దతు ఇస్తారని నమ్ముతున్నా.

## 30న జూనియర్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

మిర్యాలగూడ, జూన్ 27 : ఈ నెల 30న మిర్యాలగూడ పట్టణంలోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో నల్లగొండ, సూర్యాపేట జిల్లాల జూనియర్ బ్యాడ్మింటన్ అండర్ -15, 17 (బాల, బాలికల) క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్లు మిర్యాలగూడ డీఎస్‌ఏ బ్యాడ్మింటన్ కోచ్ ఎం.రామకృష్ణ గురువారం తెలిపారు. ఎంపికైన అండర్ 15 క్రీడాకారులు జూలై 14 నుంచి 17 వరకు మెదక్ జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో, అండర్ 17లో ఎంపికైన క్రీడాకారులు జూలై 23 నుంచి 26 వరకు వరంగల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ నెల 30న జరిగే ఎంపిక పోటీలకు తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు.

## 1,909 మందికి స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతులు

- తర్వలో ఎస్‌జీటీల బదిలీలు

రామగిరి, జూన్ 27 : ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ జిల్లాలో కొనసాగుతున్నది. ఆయా విభాగాల్లో షెడ్యూల్ ప్రకారం ఇప్పటి వరకు ఎస్‌జీటీ టు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు పూర్తయినట్లు నల్లగొండ డీఈఓ భిక్షపతి తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1909 మందికి స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతులు లభించాయి. ఇందులో నల్లగొండ జిల్లాలో 842, సూర్యాపేటలో 596, యాదాద్రి భువనగిరిలో 471 మంది ఉన్నారు. పదోన్నతి పొందిన టీచర్లు గురువారం ఆయా పాఠశాలల్లో చేరారు. ఇక ఎస్‌జీటీ బదిలీలు మిగిలి ఉండగా, ఎస్‌జీటీ నుంచి పదోన్నతులతో ఏర్పడిన ఖాళీలను గుర్తించడంతో పాటు బదిలీలకు అవసరమైన జాబితా తయారీలో విద్యాశాఖ అధికారులు నిమగ్నమైనట్లు తెలుస్తుంది. ఒకట్రెండు రోజుల్లో ఎస్‌జీటీ బదిలీలకు సంబంధించిన జాబితాను వెల్లడించనున్నట్లు సమాచారం.

# జీతాలు మహాప్రభో..

## మోడల్ స్కూల్ హాస్టల్ సిబ్బందికి వేతనాల్లేవ్

- ఐదు నెలలుగా పెండింగ్‌లో పెట్టిన కాంగ్రెస్ సర్కారు
- అరకొర జీతాలే.. అయినా సకాలంలో చెల్లిస్తలే..
- ప్రభుత్వం బడ్జెట్ ఇవ్వలేదంటున్న అధికారులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న హాస్టల్ సిబ్బంది



*సమగ్ర శిక్ష అభియాన్‌లో భాగమైన తెలంగాణ మోడల్ స్కూల్ బాలికల హాస్టళ్ల (కేజీబీవీ టైప్-4)లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, సిబ్బందికి ప్రభుత్వం వేతనాలు చెల్లించడంలేదు. ఆదర్శ పాఠశాల వసతి గృహాల్లో ఐదు నెలలుగా జీతాలు ఇవ్వకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తున్నది. అరకొర జీతాలకు పనిచేస్తున్నా కనీసం సర్కారు పట్టించుకోవడంలేదు. ప్రభుత్వం బడ్జెట్ ఇవ్వకపోడంతో ఆలస్యం అవుతుందని అధికారులు చెబుతున్నారు. దాంతో సిబ్బందికి తీవ్ర అవస్థలు తప్పడం లేదు.*

*– యాదాద్రి భువనగిరి, జూన్ 27 (నమస్తే తెలంగాణ)*

తెలంగాణ ఆదర్శ పాఠశాల బాలికల హాస్టల్ సిబ్బందికి ఐదు నెలలుగా జీతాలు రావడం లేదు. కొత్త సర్కారు వచ్చి ఆరు నెలలు దాటినా ఇప్పటి వరకు పైసా ఇవ్వలేదు. జనవరి నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని సిబ్బంది వాపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో 30 హాస్టళ్లు ఉండగా, యాదాద్రి భువనగిరిలో ఏడు వసతి గృహాలు ఉన్నాయి. ఒక్కో హాస్టల్‌లో ఆరుగురు సిబ్బంది పనిచేస్తున్నారు. ఇందులో వార్డెన్, కేర్‌టేకర్, ఏఎన్ఎం, హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, వాచ్‌మన్ పనిచేస్తున్నారు. వీరంతా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులే. ఉమ్మడి జిల్లాలో 197 మంది స్టాఫ్ ఉండగా, యాదాద్రి భువనగిరిలో 42 మంది, నల్లగొండలో 101, సూర్యాపేటలో 54 మంది పనిచేస్తున్నారు. సర్వశిక్ష అభియాన్ కింద పనిచేస్తున్న వీరంతా జీతాల కోసం ఎదురుచూస్తున్నారు.



నారాయణపురం మోడల్ స్కూల్ బాలికల హాస్టల్

### ఆర్డర్ కాపీలు లేకుండానే విధులు

కేజీబీవీల్లో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది కంటే ఆదర్శ పాఠశాల హాస్టల్ సిబ్బందికి తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారు. వీరంతా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో సిబ్బంది పని చేస్తున్నప్పటికీ ఇప్పటి వరకు ఎవరికీ ఆర్డర్ కాపీలు రాలేదు. సాధారణంగా ఆర్డర్ కాపీలు ఇస్తే అన్ని రకాలు బెనిఫిట్స్ పొందే అవకాశం ఉంటుంది.

కానీ ఆర్డర్ కాపీలు లేకపోవడంతో అన్ని విధాలుగా నష్టపోతున్నారు. ఆర్డర్ కాపీలు ఇప్పించాలని సిబ్బంది విజ్ఞప్తి చేస్తున్నారు.

### కష్టంగా కుటుంబ జీవనం

హాస్టళ్లలో సిబ్బంది ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. వీరందరికీ అరకొర జీతాలు చెల్లిస్తున్నారు. కనీస వేతనాలు కూడా లేకుండా అతి తక్కువ జీతాలకే కొనసాగుతున్నారు. వార్డెన్‌కు రూ. 13వేలు, ఇతరులకు రూ. 7,800 వరకు చెల్లిస్తున్నారు. వీళ్లంతా 24గంటలు సేవలు నిర్వహిస్తూనే ఉంటారు. బయట అటెండర్ కంటే తక్కువ జీతాలకు పనిచేస్తున్నామని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే బడ్జెట్ రాలేదని, సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారని వాపోతున్నారు. డైట్ బిల్లులతో పాటుగా ఇస్తుండటంతో ఆలస్యమవుతున్నాయని చెబుతున్నారు. ఇంటి అద్దెలు, నిత్యావసరాలు, పిల్లల ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో నెలనెలా జీతాలు అందితేనే కుటుంబాలను కష్టంగా వెల్లదీసే కాలంలో.. అసలే వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జీతమే ఆధారమని, నెలల తరబడి పెండింగ్‌లో పెడితే ఎలా అని చెప్పుకొస్తున్నారు.

## గుర్రంపోడు డిప్యూటీ తాసీల్దార్ సస్పెన్షన్

- కోర్టు వివాదంలో ఉన్న భూమి రిజిస్ట్రేషన్ చేయడమే కారణం

గుర్రంపోడు, జూన్ 27: గుర్రంపోడు డిప్యూటీ తాసీల్దార్ ఎండీ ఫరీదుద్దీన్‌ను సస్పెన్షన్ చేస్తూ కలెక్టర్ నారాయణరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని కొప్పోలు గ్రామంలో కోర్టు వివాదంలో ఉన్న భూమిని అక్రమంగా మరొకరికి రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారంలో బాధిత మహిళ బుధవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దాంతో విచారణ చేసి బాధ్యుడైన డిప్యూటీ తాసీల్దార్ ఫరీదుద్దీన్‌ను సస్పెన్షన్ వేటు వేశారు. 2018లో జలగం లలితమ్మ తన పెద్ద కూతురు ఉజ్జిని కవిత, చిన్న కూతురు ఇనుపాములు నాగమణికి ఒక్కొక్కరికీ నాలుగు ఎకరాల 18 గుంటలను దేవరకొండ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసింది. చిన్న కూతురు నాగమణి మ్యుటేషన్ జరుగపోవడంతో ఆ భూమి లలితమ్మ పేరున రికార్డుల్లో ఉంది. ఎకరం మిస్సింగ్‌లో ఉండగా మిగతా 3 ఎకరాల 18 గుంటలు అప్పట్లో తన తల్లి దగ్గర నుంచి కుమారుడు జలగం చంద్రశేఖర్‌రావు కొనుగోలు చేసినట్లుగా రిజిస్ట్రేషన్ జరిగింది. తాము రిజిస్ట్రేషన్ చేసుకున్నా భూమిని తమ ప్రమేయం లేకుండా రెండోసారి రిజిస్ట్రేషన్ చేయడంపై కవిత, నాగమణి కోర్టును ఆశ్రయించగా యథాతథ స్థితిలో ఉంచమని కోర్టు అదేశించింది. కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి ఇదే భూమిని మళ్లీ గతేడాది కల్లెం మంజుల అనే కొనుగోలు చేసినట్లుగా రిజిస్ట్రేషన్ జరిగింది. మళ్లీ బుధవారం జలగం చంద్రశేఖర్‌రావు కుమారుడు మధుకు రిజిస్ట్రేషన్ జరిగింది. దాంతో బాధిత మహిళ ఉజ్జిని కవిత ఫిర్యాదు మేరకు విచారణ చేసి సస్పెండ్ చేశారు.